# కవితా కౌముది

## మాయమవుతున్న దారి

వెంకట్ దశిక

ఆకాశం అలసిపోయి నిద్రలోకి జారింది,
గాలి దాని కలల్ని తలపులో మోస్తూ
మన చెవుల దగ్గరగా నడిచింది.
నక్షత్రాలు ఒక్కొక్కటిగా
నీలిమ లోపల కరిగిపోతూ
మనసు తడిమే చీకటిలో
ప్రశ్నల దారాలు నేస్తున్నాయి.
అద్దం పగిలిపోయింది,
కానీ ముక్కలు నేలపై పడలేదు—
అవి మనలోనే ఎక్కడో
మనసు అంచుల్లో
కత్తుల్లా నడుస్తూ,
మనమని పిలిచే నీడల మీద
తమ ప్రతిబింబాన్ని పరుచుకున్నాయి
ఈ రూపం ఎవరిది?
ఈ గుండె చప్పుడు ఎవరిది?
అని అవి మళ్లీ మళ్లీ అడుగుతున్నాయి.

కాలం—
ఒక వెన్నెముకలా వంగి
మన క్షణాలను నలిపేస్తుంది,
మన కలల్ని చూర్ణం చేస్తుంది,
అయినా మనం నిశ్శబ్దంగా నడుస్తూనే
ఉంటాం
ఆ అస్తిత్వపు పొడవైన మార్గంలో.

కానీ చివరికి—
మనమే దారి తప్పుతున్నామా?
లేక దారే మాయమై
మన కళ్ల ముందే కరిగిపోతోందా?

★★★

## నాకు నేను నచ్చిన రోజు

డా. మూర్తి జొన్నలగెడ్డ

వీధి కుక్కలు రాత్రంతా
రాగ తాళ నిర్దేశం లేకుండా
కాట్లాడు కుంటున్నా,
నా ప్రియతమ నేస్తం
జెట్ విమానాలు జడిసేలా
గురక విభావరి మొదలిడినా,
ఎయిర్ కండిషనరు
స్కందోలముతో కాక
నిర్ఘోషముతో వణికించినా,
కటుకీట నాశని
సహస్రాధిక కటుకీట ధ్వని చేస్తున్నా,
చీకటిలో కూడా
చిరు నగవు చెదరక..
మున్ముందు ఘడియలకు
ముందసలే వెరువక..
నా మధురోహలలో
నేను తేలియాడుతూ
నా కమ్మని కలలు నేను కంటూ!!
ఆ కాళ రాత్రి అసలు
నేను నిదురించానని
అవగతమైనంతనే
నాకు నేను తెగ నచ్చేశాను..
సదరు నిందితులెవరిపై
పగ ప్రతీకారాల యోచన
చేయలేదన్న క్షణంలో నేను
గాంధీ గౌతములను దాటేశాను
ఇలా నాకు నేను నచ్చిన రోజు
అదే కదా మీరు వేచి వేసాలిన రోజు! ★★★

## స్వల్పధరకే నిద్ర

శ్రీ సాహితి

నిద్రను అమ్మే
సంత ఇంకా తెరచుకోలేదు నీలో

జేబు నిండా తృప్తితో
కొనే స్తోమత ఉంటే

అతి స్వల్ప ధరకే
పెద్ద మొత్తంలో నీకే అమ్ముతుంది.

పడక, పరుపు, మత్తు, మైకం
అక్కరలేని కళ్ళు స్వేచ్ఛగా

నీకు కాస్తా దూరంగా తీసుకెళ్ళి
ఏది గుర్తుకురాలేంత ప్రదేశంలో
వదలివస్తాయి నిన్ను.

ఒక్కడివే సంతోషంగా
మేల్కొని తిరిగిస్తుంటే
మెలిసిపోతూ మురిపిస్తాయి.

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

మనసు తీరగ నవ్వితీ దినము నేను
పృథివి మోదకరముగ కన్పించె నాకు
ఉల్లమును విప్పి మాటాడితొకరితోడ
ఎడద బరువెల్ల యెచటికో యెగిరిపోయె

పాడితిని హాయిగానొక్క పాట నేడు
చింతలను వీడి మది మున్గె సంతసమున
నడచితిని నేడు ప్రకృతి యందముల గనుచు
నా హృదయమెనలేని యానందమందె

ప్రేమ పంచుటనెంత సంప్రీతి గలదు!
చిన్న ప్రియభాషణమున నా చిత్తమలరె
దూరమైనట్టి యాప్తులు చేర వచ్చి
పలుకరించగ మదిగల్గె పులకరింత

మహిని సర్వజనులయందు మంచితనము
కాంచితిని నేడు బ్రతుకు భాగ్యమ్మునొందె
ఎల్లరను స్వజనమ్ముగానెంచు దృష్టి
ఉదయమై మదినానందముద్భవించె

అవగతమ్మయ్యె ముదమునకర్థమేమొ
ఎదను కనుగొంటినానందమెచట గలదొ
తెలిసికొంటిని దాని సాధించుటెట్లొ
స్వాంతమందున జ్ఞానదీపమ్ము వెలిగె

COMMENTS